సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

మాచారెడ్డి, ఆగస్టు 25: సైబర్ నేరాలపై జాగ్రత్త వహించాలని మాచారెడ్డి ఎస్ఐ అనిల్ తెలిపారు. ఆదివారం సెల్‌ఫోన్ పోగొట్టుకున్న నలుగురు బాధితులకు సీఈఐఆర్ ద్వారా కనిపెట్టి అందించారు. ఈ సందర్భంగా ఆయన సైబర్ నేరాలపై పలు సూచనలు చేస్తూ నేరస్తులు పోలీసుస్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీకొడుకు లేదా తమ్ముడు పలానా కేసులో అరెస్టు అయి ఇప్పుడు మా దగ్గర ఉన్నాడని మీరు వెంటనే డబ్బులు తీసుకుని రావాలని ఫేక్‌కాల్స్ చేస్తున్నారని తెలిపారు. ఎవరికైన అలాంటి కాల్స్ వస్తే దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని అన్నారు.

చెప్పిందే రోగం.. చేసిందే వైద్యం!



భిక్కనూర్‌లో క్లినిక్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం



- సీజనల్ వ్యాధుల పేరిట ఆర్ఎంపీ, పీఎంపీల దందా
- అమాయక ప్రజల భయమే వారికి ఆసరా
- లింగంపేట, భిక్కనూర్‌లో అవగాహన లేని వైద్యంతో ఇద్దరు బలి
- ప్రమాదాలు జరిగినప్పుడే వైద్య ఆరోగ్యశాఖ చర్యలు
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఆసుపత్రులు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 25 :సీజనల్ వ్యాధులు ఒక వైపు.. ప్రాణపాయ స్థితికి చేరుకునే డెంగ్యు లాంటి వ్యాధులు మరోవైపు జిల్లా మీద పంజా విసురుతుంటే ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏ ఆసుపత్రిలో చూసినా రోగాలతో ప్రజలు కిక్కిరిసి పోతున్నారు. ఇలా రోగాలతో బాధపడుతున్న ప్రజల భయాన్ని ఆసరా చేసుకుంటు వారి అనారోగ్యమే కొందరు ఆర్ఎంపీ, పీఎంపీల ఆదాయంగా మారుతుంది. చిన్నపాటి జ్వరమొస్తే చాలు ప్రజల నుంచి రూ.వేలకు వేలు పిండుతూ మిడిమిడి జ్ఞానంతో వైద్యం చేయడం, నిబంధనలకు విరుద్ధంగా వారే పరీక్షలు చేయిస్తూ మందులు రాస్తూ ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్నారు. కాసుల కోసం, కమీషన్లపై ఆశతో పేద రోగులను పీల్చిపిప్పి చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు వస్తున్న క్రమంలో అవగాహన లేని కొందరు గ్రామీణ, పట్టణ ప్రజలు పెద్ద ఆసుపత్రికి పోయో వరకు అందుబాటులో ఉండే ఆర్ఎంపీ, పీఎంపీల వద్దె వైద్యం చేయించుకుంటున్నారు. అయితే తమకు వచ్చిన కేసును వదలని సదరు వైద్యులు తాము చెప్పిందే రోగం.. చేసిందే వైద్యం అనే రీతిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నపాటి జ్వరం వచ్చిందంటే చాలు అసలు ఆ రోగి పరిస్థితి పక్కన పెట్టి.. ఇష్టారీతిన వైద్యం నిర్వహిస్తున్నారు. అలా రోజుల తరబడి వైద్యం చేసి.. తీరా పరిస్థితులు చేయి దాటాక తమకు ఏ ఆసుపత్రి వారు ఎక్కువ కమీషన్ ఇస్తారో ఆ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించడం, ఏ ల్యాబ్ వారు ఎక్కువ కమీషన్ ఇస్తే వారి వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించడం లాంటివి చేస్తున్నారు. పరిస్థితి విషమిస్తే చేతులెత్తేసి నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో తొలుత వైద్యం చేసినందుకు తీసుకునే డబ్బుకు అదనంగా.. ఆసుపత్రి ఫీజుల్లో ల్యాబ్ ఫీజుల్లో కమీషన్ల రూపంలో ఇంకొంత దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. గంటల తరబడి చదివి అనేక పరీక్షలు పాసై మానవ శరీరంలోని ఆయా అవయావాలపై పట్టు సాధించిన వైద్యుల కంటే ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యం మితిమీరిపోతోంది. ఈ దందాతో మంచి లాభాలు ఉంటుండడంతో పదో తరగతి పాస్ కాని వ్యక్తులు సైతం కొద్దిరోజులు ప్రైవేట్ వైద్యుల దగ్గర ఫస్ట్ ఎయిడ్ శిక్షణ పొంది ఎక్కడో ఒక్కచోట అయితే ఫేక్ సర్టిఫికెట్ లేదంటే కనీసం ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ సైతం లేకుండా చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కనీసం దృష్టి సారించకపోవడంపై ప్రజల ప్రాణాల మీదకు వస్తోంది. ఇటీవల లింగంపేట మండలంలో ఓ యువకుడు ఆర్ఎంపీ చేసిన వైద్యంతో చనిపోవడంతో ఆసుపత్రిని వైద్యఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. అదేవిధంగా భిక్కనూర్ మండల కేంద్రంలో భార్య సర్టిఫికెట్‌తో భర్త వైద్యం అందించడంతో మరో వ్యక్తి మృతి చెందాడు. దీంతో ఆ ఆసుపత్రిని మూసివేశారు. రాజంపేట మండల కేంద్రంలోనూ ఇదే తరహాలో ఓ ఆర్ఎంపీ వైద్యుడు చేసిన చికిత్సకు ఓ చిన్నారి మృతి చెందిందని వారి కుటుంబీకులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఇలా అనేకం బయటకు వస్తున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వీధివీధినా క్లినిక్‌లు.. ఇంటింటికీ వైద్యం

ప్రజల అమాయకత్వం వారి అవసరాలను ఆసరాగా చేసుకొని కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు ఇంటర్ కూడా పాస్‌కాకున్నా ఎంబీబీఎస్, ఎండీ డాక్టర్ దగ్గర 6 నెలల నుంచి సంవత్సరం పాటు పని చేస్తే చాలు డాక్టర్‌ల అవతారం ఎత్తుతున్నారు. పట్టా పరిజ్ఞానం లేకపోయినా వైద్యులుగా చలామణి అవుతున్నారు. ఏదో ఒక గ్రామంలో లేదంటే పట్టణంలో ప్రాథమిక చికిత్సాలయం అనే బోర్డు పెట్టి ఇంటింటికీ తిరుగుతూ ఎంబీబీఎస్, ఎండీ, అవసరమైతే సర్జన్ స్థాయి వైద్యం వారే చేస్తున్నారు. పట్టాపొంది ఏదో ఒక స్పెషలైజేషన్ చేస్తున్న వైద్యుడి కంటే మల్టీస్పెషాలిటీ వైద్యం ఒక్కరే చేస్తున్నారంటే ఏ స్థాయిలో దందా నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ లాంటి పట్టణాల్లో వార్డుకు 2 నుంచి 3 క్లినిక్‌లు



లింగంపేటలో క్లీనిక్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

తెరుస్తున్నారు. క్లీనిక్ అనుబంధంగా స్నేహితుడో, తెలిసిన వారితో మెడికల్ షాప్‌ను ఏర్పాటు చేయించడం అందులోనే మందులు కొనుగోలు చేసేలా రోగులను మళ్లిస్తున్నారు. అధికారుల కళ్లు కంపేందుకు ప్రాథమిక చికిత్సాలయం అని బోర్డు పెట్టి ఇంటింటికీ తిరుగుతూ రోగులకు ఇంజక్షన్‌లు, మందులు ఇస్తున్నారు. కొన్ని సమయాల్లో డయాగ్నస్టిక్ పరీక్షల కోసం కమీషన్లు ఇచ్చే వారి దగ్గరకు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం ఒక ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుడు 2 వేల నుంచి 3 వేల వరకు ఆదాయం పొందుతున్నాడంటే వారు చేస్తున్న వైద్యం ఏ స్థాయిల్లో ఉంటుందో అర్థమవుతోంది. కాసుల కోసం తప్ప ప్రజల ప్రాణాలంటే లెక్కచేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులున్నా వారు ప్రైవేట్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వడం, సమయం పాటించకపోవడం వచ్చిన రోగులను సరిగా పట్టించుకోకపోవడం, స్థానికంగా ఉండకపోవడంతో ప్రజలు ఆర్ఎంపీలు, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. దాన్ని ఆసరాగా చేసుకొని కొందరు పట్టలేని వైద్యులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. తమకు తెలిసిన వైద్యాన్ని కొంతమేరకు నిర్వహించి ఆ తర్వాత పెద్దా ఆసుపత్రికి తరలిస్తున్నారు. ప్రస్తుతం పెద్ద ఎత్తున డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. ప్రాథమిక దశలోనే ఆ వ్యాధిని గుర్తించి తగిన వైద్యం అందిస్తేనే ప్రాణాపాయస్థితి నుంచి బయటపడుతున్నారు. కానీ ఆర్ఎంపీ, పీఎంపీలు ఎప్పటిలాగే మిడిమిడి జ్ఞానంతో సేవలు అందిస్తుండడంతో పుణ్యకాలం అంతా అక్కడే గడిచిపోయే ప్రాణాపాయస్థితికి చేరుకున్న తర్వాత నిపుణులైన వైద్యుల వద్దకు వస్తున్నారు. కొందరు బతికిబట్టకడుతుండగా మరికొందరు మృత్యుఒడిలోకి చేరుతున్నారు.

ప్రాథమిక చికిత్సకు మాత్రమే అర్హులు

ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రాథమిక వైద్యం చేయడానికి మాత్రమే అర్హులు. అత్యవసరసమయంలో లేదంటే రాత్రివేళలో స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో లేనప్పుడు రోగి పరిస్థితిని చూసి అవసరమైతే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయాలి. చిన్నపాటి జ్వరం అయితే పారాసిటమల్, జలుబుకు డీకోల్డ్ లాంటి చిన్నచిన్న మాత్రలు ఇస్తే సరిపోతుంది. కానీ చాలా మంది వారి పరిధి దాటి వైద్యం చేస్తున్నారు. అవగాహన లేక కొంత.. రోగం తొందరగా తగ్గితే మంచి డాక్టరుగా పేరు సంపాదించాలన్న ఆత్రుతలో అవసరమున్న దానికంటే ఎక్కువ మోతాదులో మందులిస్తున్నారు. ఈ క్రమంలో మళ్లీ అనారోగ్యం వస్తే గతంలో ఇచ్చిన మోతాదును మించి మందులు ఇవ్వాల్సి వస్తోంది. తద్వారా రోగి బలహీనపడిపోవడమే కాకుండా ఎక్కువ రోగాలతో సహవాసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆయా పరిస్థితుల్లో అన్ని రకాల టెస్టులు నిర్వహిస్తున్నారు. వచ్చిన రోగం కంటే డిశ్చర్జ్ అయ్యేటప్పుడు వేసే బిల్లు చూస్తేనే మరో కొత్త రోగం పుడుతుందేమోనని భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యంపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి కరువు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇబ్బడి ముబ్బడిగా క్లీనిక్‌లు ఏర్పాటు చేసి మీతిమీరిన వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతోనే ప్రజల ప్రాణాల మీదకు వస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భిక్కనూర్ మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా అసలు వైద్యం తెలియని వ్యక్తి చికిత్స అందించడం చేస్తూ ఒకరి ప్రాణాలు పోయేందుకు కారణమైన సంఘటన చోటు చేసుకుంది. లింగంపేటలో సైతం ఆర్ఎంపీ అందించిన వైద్యానికి ఓ యువకుడు మృతి చెందాడు. రాజంపేట మండల కేంద్రంలో సైతం ఓ చిన్నారి ఈ తరహాలోనే మృతి చెందింది. ఈ ఆసుపత్రిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. ప్రజలు ఆందోళన చేస్తే తప్ప వైద్య ఆరోగ్యశాఖ పనితీరు బట్టబయలు కావడం లేదు. కొందరు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి ఇలాంటి వైద్యం గురించి తెలిసిన ముడుపులు తీసుకుంటూ అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం డెంగ్యూ కేసులు పదుల సంఖ్యలో నమోదు అవుతున్న తరుణంలో జిల్లా ఉన్నతాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ ఈ మిడిమిడి జ్ఞాన వైద్యంపై దృష్టి సారించకపోతే ఇంకా ఎందరి ప్రాణాలు గాల్లో కాలుస్తాయోననే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు జరిగేనా?

- 11 ఏళ్లుగా ఒకే చోట విధుల నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో 15 ఆదర్శ పాఠశాలలు, 160 మంది టీచర్లు
- గత ఏడాది బదిలీ షెడ్యూల్ విడుదల
- కొందరు కోర్టుకు వెళ్లడంతో నిలిచిన ప్రక్రియ
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

ఎల్లారెడ్డి, ఆగస్టు 25 : ఆదర్శ పాఠశాల టీచర్లు బదిలీలు, పదోన్నతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియామకమైనప్పటి నుంచి ఒకే చోట 11 సంవత్సరాలుగా పని చేస్తున్నా బదిలీలు పదోన్నతులకు నోచుకోకపోవడం లేదు. గత ఏడాది బదిలీల షెడ్యూల్ విడుదలైనా కొందరు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం తీర్పు రిజర్వులో ఉంది. అన్ని విభాగాల్లో బదిలీలు పదోన్నతులు చేపడుతున్నా సర్కారు తమ సమస్యల విషయంలో సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు కోరుతున్నారు.

2013-14లో ఏర్పడిన ఆదర్శ పాఠశాలలు

జాతీయ విద్యా విధానంలో భాగంగా 2013-14 విద్యా సంవత్సరంలో ఆదర్శ పాఠశాలల్లో ఏర్పాటుకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇందులో 6వ తరగతికి వంద మంది చొప్పున ఒక్కో పాఠశాలలో 500 మంది ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఒక్కో గ్రూపులో 40 మంది చొప్పున 320 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో అభివృద్ధి హాస్టల్‌లో ఏర్పాటు, వసతుల కల్పన, బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

11 ఏళ్లుగా ఒకే చోట విధులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 160 మంది ఉపాధ్యాయులు 11 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్నారు. 2013లో నియామకమైనప్పటికీ ఇప్పటి వరకు వీరికి బదిలీలు పదోన్నతులు చేయలేదు. గత ఏడాది వారికి ప్రభుత్వం బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి షెడ్యూల్ విడుదల చేసింది. కానీ కొంత మంది టీచర్లు బదిలీలపై కోర్టుకు వెళ్లడంతో స్టే విధించింది. దీంతో బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. వాదనలు విన్న కోర్టు ఈ ఏడాది ఫిబ్రవరిలో తీర్పును రిజర్వులో పెట్టింది. ఇంత వరకు ఉపాధ్యాయులు బదిలీల విషయంలో ఆందోళన చెందుతున్నారు.

బదిలీలు, పదోన్నతులు లేక ఇబ్బందులు

అర్హులైన టీజీటీ టీచర్లు, పీజీటీలుగా పీజీటీలు ప్రిన్సిపా ల్‌గా పదోన్నతి పొందలేకపోతున్నారు. ఒకే చోట ఏళ్ల తరబడి పని చేయడంతో అజామాయిషి కొరవడుతు ఒదన్నారు. అన్ని విభాగాల్లో బదిలీలు పదోన్నతులు చేపడుతున్న ప్రభుత్వం ఆదర్శ పాఠశాలల్లో చేపట్టకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

జడ్జిమెంట్ వచ్చేలా చూడాలి

• నరసింహాచారి, పీజీటీ, నాగిరెడ్డిపేట

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకుని జడ్జిమెంట్ వచ్చేలా ప్రయత్నం చేయాలి. చాలా కాలంగా ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. కావున బదిలీలు చేసి న్యాయం చేసి 010 అమలు చేసి ఒకవ తేదీ వేతనాలు చెల్లించాలి. హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి.

భర్తీకాని కారుణ్య నియామకాలు

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు వివిధ కారణాలతో మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టడం లేదు. దీంతో మృతి చెందిన టీచర్ల కుటుంబ సభ్యులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శక్తిరాజ్ బ్లడ్ క్యాన్సర్‌తో ఇటీవల మృతి చెందాడు. మిగతా ఉపాధ్యాయుల మాదిరిగా తమకు హెల్త్ కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ లేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

న్యాయం చేయాలి

• సాయిబాబా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఎల్లారెడ్డి

బదిలీల అంశంపై కోర్టు తీర్పు తొందరగా వెలువడి ఎలా ప్రభుత్వం చొరవ చూపి ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి. ఉపాధ్యాయుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి. 010 పద్దు కింద వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

ఎట్టకేలకు లింగంపల్లి కలాన్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి



లింగంపల్లి కలాన్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాగిరెడ్డిపేట, ఆగస్టు 25 : మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామం వద్ద పోచారం ప్రధాన కాలువపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 50 లక్షల 90 వేల రూపాయల వ్యయంతో ఈ బ్రిడ్జిని మంజూరు చేసింది. 28 మే 2023న ఈ బ్రిడ్జి నిర్మాణానికి మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం పనులను వెంటనే చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం పనులను అర్థాంతరంగా నిలిపేశాడు. సుమారు ఎనిమిది నెలలుగా ఈ బ్రిడ్జి నిర్మాణం పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో జూన్ 10న 'నిలిచిపోయిన లింగంపల్లి కలాన్ బ్రిడ్జి నిర్మాణ పనులు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' వార్త కథనాన్ని ప్రచురించింది. ఈ వార్తకు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. బ్రిడ్జి నిర్మాణం పనులను వెంటనే చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను అధికారులు ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్ తిరిగి పనులను వెంటనే పునఃప్రారంభించారు. దిమ్మెల వరకు బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగగా, స్లాబ్ పనులు, బ్రిడ్జికి ఇరువైపుల సైడ్‌వాల్ నిర్మాణం తదితర పనులు మిగిలి ఉండటంతో కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం పనులను వెంటనే చేపట్టి వేగవంతంగా పనులు జరిపి బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం పనులు మధ్యలో అర్థాంతరంగా నెలల తరబడి నిలిచిపోగా, 'ఆంధ్రజ్యోతి' కథనంతో తిరిగి నిర్మాణం పనులు పునః ప్రారంభమై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాస్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీలు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 25: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో ఆదివారం యోగాసన చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు. సుమారు 25 పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జిల్లా క్రీడాశాఖల అధికారి జగన్నాథం, డీఈవోరాజు, లేబర్ కమిషనర్ కోటేశ్వర్‌లు హాజరయ్యారు. ట్రెడిషనల్ సబ్ జూనియర్ బాలికల విభాగంలో గడ్డం కవిత మొదటి స్థానం, గడ్డం సునీత రెండో స్థానం, బానోత్ స్రవంతి మూడో స్థానంలో నిలిచారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో మొదటి స్థానంలో హర్షవర్ధన్, రెండో స్థానంలో కిరణ్, మూడో స్థానంలో ప్రశాంత్‌లు నిలిచారు. జూనియర్స్ బాలికల విభాగంలో మొదటి స్థానంలో అనుష్క, రెండో స్థానంలో దీపిక, మూడో స్థానంలో సోనా, జూనియర్స్ బాలుర విభాగంలో మొదటి స్థానంలో సందీప్, రెండో స్థానంలో నవదీప్, మూడో స్థానంలో రాకేష్, సీనియర్ మహిళ విభాగంలో సంధ్య, భార్గవి, స్రవంతిలు, సీనియర్ పురుషుల విభాగంలో రాజ్‌కుమార్, భరత్, నివాస్‌లు నిలిచారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న దృశ్యం

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో లక్ష పుష్పార్చన

మాచారెడ్డి, ఆగస్టు 25: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్బంగా లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారిని వివిధ రకాల లక్ష పూలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి దంపతులు, వివిధ గ్రామాలకు చెందిన దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీధర్‌రావు, పూజారులు శ్రీనివాసాచార్యులు, పరంధామాచార్యులు, నరసింహాచార్యులు, సంజీవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

మధ్యాహ్న భోజనంపై కూరగాయల ధరల ప్రభావం



● బిల్లులు రాక ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు

మద్నూర్, ఆగస్టు 25: మార్కెట్‌లో పెరిగిన కూరగాయలు ఇతర నిత్యావసర సరుకుల ధరలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ప్రభావం చూపుతున్నాయి. పేద మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో ఆకలి వెతలు తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఇటీవల నిత్యావసర సరుకులతో పాటు కూరగాయాల ధరలు పెరగడంతో పథకం అమలులో ఏజెన్సీ మహిళలు అవస్థలు పడుతున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలంటే ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు బిల్లులు చెల్లింపులు జాప్యం జరుగుతుండటంతో నానా అవస్థలు పడుతున్నారు. సర్కారు బడుల్లో ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.5.45 పైసలు, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు కోడి గుడ్డు కాకుండా రూ.8.17 పైసలు, 9, 10వ తరగతి విద్యార్థులకు కోడిగుడ్డుతో పాటు రూ.10.67 పైసలు చొప్పున మధ్యాహ్న భోజనానికి చెల్లిస్తున్నారు. అయితే పెరిగిన ధరలు పరిగణలోకి తీసుకుంటే చెల్లింపులు సరిపోవడం లేదనేది ఏజెన్సీల వాదన. మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఒకటి నుంచి 8వ తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60-40 చొప్పున నిధులు కేటాయిస్తున్నాయి. 9, 10వ తరగతి విద్యార్థులకు అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 100 గ్రాములు ఉంటుంది. ఉన్నత పాఠశాల విద్యార్థులకు 150 గ్రాముల చొప్పున బియ్యాన్ని ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. పప్పులు, నూనె, కూరగాయాలు ఇతర వంట సామాగ్రి, వంట గ్యాస్, కుకింగ్ కాస్ట్ కింద బిల్లులను గత జనవరి వరకు చెల్లించింది. భోజన బిల్లులు మార్చి నెల వరకు చెల్లించారు. తొమ్మిది పదవ తరగతి విద్యార్థులకు ఈ ఏడాది జనవరి ఉంచి వేసవి సెలవుల నాటికి పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించినట్లయితే తాము ఆర్థికంగా నిలదొక్కుకుంటామని మహిళా సంఘాలు డిమాండ్‌చేస్తున్నాయి.

చిరుతిళ్లపై కమ్ముతున్న విషం!

● ఉమ్మడి జిల్లాల్లో జోరుగా నకిలీ బ్రాండ్‌ల పేరిట విక్రయాలు
● చిన్నారులే లక్ష్యంగా అక్రమార్కుల దందా
● తనిఖీలు చేపట్టని ఆహార నియంత్రణ అధికారులు

బాన్సువాడ, ఆగస్టు 25: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో చిరు తిళ్లపై విషం కమ్ముతున్నాయి. మార్కెట్‌లో జోరుగా నకిలీ బ్రాండ్‌ల పేరిట అక్రమ దారులు విక్రయాలు చేస్తున్నారు. చిన్నారులే లక్ష్యంగా వివిధ రంగు రంగుల ప్యాకింగ్ రూపంలో మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను చిరుతిండ్లకే అక్రమ దారులు జోరుగా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు తినే తిండ్లపై అసలు బ్రాండ్ లేకుండానే అందమైన ప్యాకింగ్‌లను రూపొందిస్తూ చిన్నారులు ఆకర్షితులయ్యే విధంగా తయారు చేస్తున్నారు. ఆకట్టుకునే బొమ్మలు, రంగుల రంగుల ప్యాకింగ్‌లతో చిన్నారుల చిరు తిండ్లను విక్రయిస్తున్నారు. చిన్నారులు అల్లరిని మాన్పించేందుకు తల్లిదండ్రులు ఏమి చేయలేక కొనివ్వక తప్పడం లేకపోయింది. ఉభయ జిల్లాల్లో చిరు తిండ్లపై కోట్ల రూపాయల్లో దందా కొనసాగుతుంది. నకిలీ బ్రాండ్ల పేరిట చిరు తిండ్లపై వైద్యులు చిన్నారులు తినవద్దంటూ వైద్య సలహాలు ఇస్తున్నా ఎక్కడ మాత్రం ప్రభావం కనిపించడం లేదు. దనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు ఈ దందాను మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. తక్కువ ధర పేరిట వ్యాపారాన్ని మార్కెట్‌లో ప్రారంభించి కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. చిరు తిండ్లపై ఉభయ జిల్లాల్లోని ఆహార నియంత్రణ అధికారులు మత్రం కన్నెత్తి చూడకపోవడం ఒకవైపు అయితే తనిఖీలు చేపట్టకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తక్కువ ధరలో ఆకర్షణీయమైన ప్యాకింగులు..

మార్కెట్‌లో చాలా వరకు చిన్నారులకు సంబంధించిన తిను బండారాలు తక్కువ ధరకే లభిస్తాయి. చిన్న పిల్లలను ఆకర్షించే విధంగా రంగు రంగుల ప్యాకింగులు చేపడుతున్నారు. ఒక్క రూపాయి నుండి 50 రూపాయలవరకు రకరకాల సైజులు, వివిధ రుచులు, ఫ్లేవర్లతో విక్రయాలు చేపడుతున్నారు. చూడటానికి ఆకర్షణీయమైన ప్యాకింగులు చూసి ఖరీదైన వస్తువు మాదిరిగానే కనిపిస్తున్నా వాటి ధర మాత్రం తక్కువనే. దీంతో చిన్నారులు వాటిని కొనేందుకు మారం చేస్తూ కొనేంత వరకువిడిచి పెట్టలేని విధంగా ఆకర్షితులను చేస్తున్నారు. అంతేకాకుండా మార్కెట్‌లో ఎక్కువగా క్రేజ్ ఉండే వాటి పేర్లనే చిరు తిండ్లకు మార్చడంతో పిల్లలు మరింత ఆసక్తిని పెంచుకుంటారు. ఇలాంటి చిన్న చిన్న వాటితోనే లక్షల రూపాయలదందాను కొనసాగిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

జోరుగా నకిలీ చిరుతిండ్ల విక్రయాలు కొనసాగుతున్నా చిన్నారులకు ప్రమాదమని తెలిసినా ఆయా జిల్లాల ఆహార నియంత్రణ అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. చిన్నారుల తినుబండారాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షించాల్సిన ఆహార నియంత్రణ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నారుల ప్రాణానికి ఏదైనా ముప్పు సంభవించినప్పుడే హడావిడిగా మార్కెట్‌లో దాడులు చేస్తూ తూతూ మంత్రంగా చేతులు దులుపుకుంటారు. కానీ, నకిలీ బ్రాండ్ల పేరిట, నాసిరకం చిరుతిండ్లపై నియంత్రణను మాత్రం చేపట్టడం లేదు.

నాసిరకం పదార్థాలు తింటే ప్రమాదకరం..

: శ్రీనివాస్ ప్రసాద్, పిల్లల వైద్య నిపుణులు, బాన్సువాడ

మార్కెట్‌లో నాసిరకం తిను బండారాలు చాలా వరకు లభిస్తున్నాయి. చిన్న పిల్లలు ఆకర్షితులై చిరు తిండ్లపై ఎక్కువగా మోజు చూ పెడుతున్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉండి, వివిధ రసాయనాలతో ప్రమాదకరంగా ఉన్న తిను భండారాలను తింటూ పిల్లలు తీవ్ర అనారోగ్యానికి గురవుతారు. నాణ్యత లేని చిరు తిల్లు తినకుండా పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి. నాసిరకం చిరు తిండ్ల పట్లచిన్నారులు దూరంగా ఉండటం చాలా మంచిది. ఇప్పటికైనా చిన్నారులు చిరుతిండ్లపై మోజు చూపకుండా ఇంట్లో వండిన ఆహారాన్నే తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

పాఠశాలల్లో ఘనంగా
శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు25: ఆర్మూర్ పట్టణంలోని శ్రీబాషిత హైస్కూల్‌లో ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధకృష్ణులు, గోపాల వేషాధారణలతో అందరిని అలరించారు. అనం తరం విద్యార్థినులు పలు సాంస్కృతిక నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు లోక భూపతిరెడ్డి, కోటపాటి నర్సింహంనాయుడు, కరస్పాండెంట్ పోలపల్లి సుంధర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు. అదే విధంగా పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్‌లో శ్రీకృష్ణష్టామి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోస్రా: మండలంలోని చింతకుంట గ్రామంలోని నలంద విద్యానిలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల కరస్పాండెంట్ రేఖా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన పూజ కార్యక్రమాలు చేసి ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్థులు గోపిక, శ్రీకృష్ణుల వేషధారణలతో నృత్యాలు చేసి అలరించారు. కృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులు పోటాపోటీగా ఉట్టి కొట్టి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బాలాజీ పంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణష్టామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గోపూజ కార్యక్రమం నిర్వహించి భజనకీర్త నలు ఆలకించారు. అనంతరం కల్చరర్ అనంతరం జగన్నాథ్ బాలిదేవ సుభద్ర సుదర్శనకు 56రకాల నైవేద్యాలు సమర్పించి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు రామంతరాయ గౌరవదాస్, పట్టణ అధ్యక్షుడు హర్తిక ప్రభుజి గంగేశ్వర రామదాస్ ప్రభుజీ, నిమదాస్, భారత్ ప్రభు, కౌనిక్‌ప్రభు, జి.మణికంత, శ్రీకర్, భక్తులు పాల్గొన్నారు.

అడవి పందులను తరలిస్తున్న వాహనం పట్టివేత

నందిపేట, ఆగస్టు 25: నందిపేట మండలం శాపూర్ గ్రామంలో అడవి పందులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని ఆదివారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో కరెంటుషాక్‌తో వన్యప్రాణులను పట్టుకుంటున్నట్టు వచ్చిన రహస్య సమాచారం మేరకు అటవీ రెంజ్ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ రెంజ్ అధికారి సుధాకర్ శాపూర్ గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అందులో భాగంగా బొలెరో వాహనంలో వన్యప్రాణులను కాపాడడానికి వలలు, కత్తులను గుర్తించారు. బొలెరో వాహనం డ్రైవర్‌ను, ఇతరులను విచారించే ప్రయత్నం చేయగా పరారయ్యారని అధికారులు తెలిపారు. వన్యప్రాణాలను వేటాడిన, ఇతర ప్రాంతాలకు తరలించిన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో పాముకాటు భయం



కొత్తపల్లి సమీపంలో కొండ చిలువను చంపిన దృశ్యం(ఫైల్)

కోటగిరి,ఆగస్టు25: వర్షాకాలం వచ్చిదంటే చాలు రైతులు, వ్యవసాయ కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతుంటారు. ఆ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే తరుచు ఎవరో ఒకరు పాము కాటుకు గురవుతుంటారు.విషపూరిత సర్పాల బారిన పడిన వారు మృత్యువాత పడుతున్నారు.జిల్లా వ్యాప్తంగా పాముకాటు బాధితుల సంఖ్య క్రమేపి పెరుగుతుంది. వ్యవసాయ క్షేత్రాల్లో రైతులు,కూలీల ఎంత జాగ్రత్తగా ఉంటున్నప్పటికీ కొందరు పాముల బారిన పడక తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో పాముకాటు మరణాలు క్రమేపి పెరుగుతున్నాయి. జిల్లాలో సంచరించే సర్పాల్లో 50శాతం విషపూరితమైన సర్పాలు ఉన్నాయి. ఒక్కొసారి కరిచిన ప్రతిసారి సర్పాలు విషాన్ని వదులుతాయని అనుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. అంతకు ముందే అది దేనైనా ఆహారంగా తీసుకున్న ఇంకా ఎవరైనా కాటు వేసిన విష ప్రభావం తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఈసీజన్‌లో కోటగిరి ఉమ్మడి మండలంలో ఇప్పటి వరకుపదుల సంఖ్యలో పాముకాటు కేసులు నమోదయ్యాయి. పాముకాటు తీవ్రత అంతగా లేకపోవడంతో మెరుగైన వైద్యంతో బాధితులు బయటపడ్డారు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా రాష్ట్రప్రభుత్వం అవసరమైన యాంటి వీనం ఇంజక్షన్ నిల్వలను స్థానిక ఆసుపత్రుల్లో సమృద్ధిగా అందుబాటులో ఉంచింది.

● ఈ జాగ్రత్తలు మేలు

చిత్తడినేలలో వర్షాలు కురిసినప్పుడు విషసర్పాలు సంచారం ఎక్కువగా ఉంటుంది. రైతులు,కూలీలు మోకాలి వరకు బూట్లు ధరించాలి. పొలంగట్ల వెంట చెత్తచెదారంలో ఎలుకలు కనిపిస్తే అక్కడ పాములుఉన్నట్లు అనుమానించాలి.

- ఇళ్లలో కోళ్లు పెంచే చోట కోళ్లఫారాలు, పావురాలు, ఇతర పక్షు జాతులు పెంచేచోట త్రాచుపాములు,రక్తపింజర్లు చేరుతాయి.
- వర్షాకాలంలో వరద కారణంగా పాములు ఇళ్లలోకి వస్తుంటాయి. అందుకు తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- చాలా కాలం నుంచి కుప్పలుగా వేసిన బ్యాగులు, తట్టలను దులిపిన తర్వాతనే వినియోగించాలి.
- గట్లపైగడ్డి ఉన్న ప్రాంతాల్లో వెళ్లేటప్పుడు కర్రను వెంట తీసుకెళ్లాలి.అడుగువేయాల్సినచోటముందుకర్రపోటు పడాలి. అక్కడే అడుగును మోపాలి.
- పాము కరిచినప్పుడు భయపడితే గుండెపోటు,పక్షవాతం వచ్చే అవకాశం ఉంటుంది.
- ప్రమాదకరమైన పాములు నాగుపాము, రక్తపింజర, కట్లపాము వంటివి ప్రమాదకరమైనవి.అవి కనిపిస్తే అత్యంత అప్రమత్తంగాఉండాలి.పాములు పట్టే వారికి సమాచారం అందించాలి.

పాము కాటు వేసిన సమయంలో భయపడవద్దు



పాముకాటుకు గురైన బాధితులు ఎట్టి పరిస్థితుల్లో భయపడకూడదు. పాము కరిచిన కాళ్లను కదల్చరాదు. దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి వెంటనే తీసుకెళ్లాలి. కాటు వేసిన చోట చర్మానికి గాట్లు పెట్టవద్దు. తాడుతో బిగించడం వంటివి చేయవద్దు. ఎందుకంటే కొన్ని సర్పాలు విషపూరితమైనవి కావు. విష సర్పానికి రెండు కోరలు ఉంటాయి. గాట్లు రెండు ఉంటే అది విషపూరితమైనవి అని అర్థం. రెండు కంటే ఎక్కువ ఉంటే అవి విషసర్పం కాదని గమనించాలి. ఒక్కో సారి విషపూరితమైనవి కరిచిన ప్రభావం ప్రమాదకరంగా ఉండకపోవచ్చు.

- సుప్రియ, వైద్యాధికారి, కోటగిరి

పర్ణశాల నిర్మాణానికి రూ.5లక్షల మంజూరు



సునీల్ కుమార్‌ను సన్మానిస్తున్న నాగాపూర్ గ్రామస్థులు

కమ్మర్‌పల్లి,ఆగస్టు25:కమ్మర్‌పల్లి మండలంలోని నాగాపూర్ గ్రామంలోగల హనుమాన్ ఆలయంలో పర్ణశాల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు అయినట్లు గ్రామమాజీ సర్పంచ్ పాలెపు నర్సయ్య తెలిపారు.పర్ణశాల నిర్మాణ ఆవశ్యకతను బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజికవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ దృష్టికి తీసుకురాగా స్పందిచిన ఆయన స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల నుంచి రూ.50 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు.నిధులు మంజూరి చేయించిన సునీల్‌కుమార్‌కు గ్రామహనుమాన్ భక్తులు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలుపు ఆదివారం సునీల్ కుమార్‌ను శాలువతో సన్మానించారు.కార్యక్రమంలో పాలేపు నర్సయ్య, మాజీఉపసర్పంచ్ కప్పదండి అశోక్, క్రీష్టుడి మల్లయ్య,బాజన్న, శివానంద్,కిషన్, గంగాధర్, పెద్దులు, బాబూరావు, చందుగౌడ్, దిలీప్ గ్రామస్థులు పాల్గొన్నారు.

బోధన్‌లో మహిళ అదృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు25: బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన అర్మన్ ప్రతిమ అనే మహిళ అదృశ్యమైనట్లు భర్త నాందేశ్వర్ ఫిర్యాదులో పేర్కొన్నారని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. ఈ నెల 24వ తేదీన బయటకు వెళ్లి వస్తానని తిరిగి ఇంటికి రాలేదని బంధువుల వద్ద చుట్టూ పక్కల వెతికిన ఆచూకీ తెలియక పోవడంతో ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. నాందేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

వేల్పూర్‌లో ఎంపీ అర్వింద్ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వేల్పూర్, ఆగస్టు25: నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ 48వ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ నాయకులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అర్వింద్ వందేళ్ల పాటు ఆయురారోగ్యాలతో జీవించాలని నిజామాబాద్ జిల్లా ప్రజలకు వారి సేవలు అందించాలని బీజేపీ నాయకులు ఈసందర్భంగా దేవున్ని కోరారు.ఈకార్యక్రమంలో బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఏలేటి రమేష్‌రెడ్డి, మండల మాజీ వైస్ఎంపీపీ బద్దం రాజారెడ్డి, నాయకులు నోముల నర్సారెడ్డి, యాల్ల రమేష్, నోముల గంగారెడ్డి, ఏలేటి బాల్‌రెడ్డి, మహిపాల్, నరేష్, సచిన్, కుర్మరమేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగులో చిక్కుకున్న టాటాఏసీ వాహనం



పెద్దవాగులో టాటా ఏసీ వాహనాన్ని తీస్తున్న దృశ్యం

మోర్తాడ్, ఆగస్టు25: మండలంలోని పాలెం, దర్మోర గ్రామాల మధ్య గల పెద్దవాగులో ఆదివారం టాటా ఏసీ వాహనం చిక్కుకుంది. ధర్మోరా గ్రామం నుంచి పాలెం గ్రామానికి వెళ్తుండగా వాగు ఉధృతంగా ప్రవహించడంపై పెద్దవాగు చెక్‌డ్యాంపై నిలిచిపోయింది. ఒక పక్క ఉధృతంగా వాగు పొంగిపోర్లుతుండగా ప్రమాదాన్ని గుర్తించిన ధర్మోరా గ్రామస్థులు టాటాఏసీ వాహనాన్ని బయటకు తీసేందుకు ట్రాక్టర్‌తో ప్రయత్నించారు. అయిన ఫలితం లేకపోవడంతో జేసీబీ సహాయంతో టాటాఏసీని వాహనాన్ని బయటకు తీశారు. దీంతో టాటాఏసీలో వాహనంలో ఉన్న వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు, తమను ఆదుకున్న గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు. ధర్మోరా గ్రామస్థులు సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : ట్రాఫిక్ ఎస్సై

ఖిల్లా,ఆగస్టు25:వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటరమణ తెలిపారు. నగరంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో ఆదివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు.రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసు శాఖతో ప్రజలు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రహ్మతుల్లా, సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

పాలెం నుంచి ధర్మోరా గ్రామానికి వాహనాలపై వెళ్లొద్దు

మోర్తాడ్: పాలెం గ్రామం నుంచి ధర్మోరా గ్రామానికి వెళ్లే వాహనదారులు పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల ఎవరు వెళ్లోద్దని ఎస్సై విక్రం తెలిపారు.ఆదివారం మండలంలోనిపెద్దవాగును పరిశీలించి చెక్‌డ్యాంపై వరద ప్రవహం ఎక్కువగా ఉన్నందున వాహనదారులు వెల్ల వద్దని వివరిం చారు.

● ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి..

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఆదివారం సాయంత్రం మంలంలోని దొన్కల్ గ్రామస్తులతో ఎస్సై విక్రం మాట్లాడారు. వాహనదారులు హెల్మెట్ ధరించకుంటే భారీగా జరిమానా విధిస్తామని తెలిపారు. వాహనదారులు హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

●హెల్మెట్ దరించని వాహనదారులకు జరిమానలు

డిచ్‌పల్లి: మండల కేంద్రం నాగపూర్ గేటు వద్ద ఆదివారం పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. హెల్మెట్ లేని ద్విచక్రవాహనదారులకు జరిమానలు విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనలు నడపవద్దని, బైకు కు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. హెల్మెట్ వాడకంతో ప్రాణాలు కాపాడుకోవచ్చు అని వాహనదారులకు అవగాహన కల్పించారు.

● హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి

ముప్కాల్: ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు హె ల్మెట్ ధరించి తమ ప్రాణాలు కాపాడుకోవాలనిబాల్కొండ హెడ్‌కానిస్టేల్ జేవం త్ అన్నారు. ఆదివారం బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో ప్రధాన కూడలి వద్ద గ్రామస్థులకు హెల్మెట్ దరించాలని, ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించారు.వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే నూతన నిబంధనల ప్రకారం అధికంగా జరిమానా రుసుము విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డు ప్రదానం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 25: నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ నిర్వాహకుడు మామిడాల మోహన్‌కు యూనివర్సల్ మెంటర్స్ అసోసియేషన్ హైదరాబాద్ ఎడ్యుకేషన్ ఐకాన్ 2024 అవార్డును అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్క్ హోటల్‌లో జరిగిన ఎడ్యులీడర్స్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ కార్యక్రమంలో ఈ అవార్డును ఆయనకు ప్రధానం చేశారు. విద్య విషయంలో ఆయన చేస్తున్న సేవలు, ఉత్తమ మార్గదర్శకునిగా ఈ అవార్డును 2023-24 సంవత్సరానికి అందజేశారు. యూనివర్సల్ మెంటర్స్ అసోసియేషన్ సీఈవో సందీప్ గులాటి, కో ఫౌండర్ అశుతోష్ దుబేలు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగుళూరు, మహారాష్ట్ర నుంచి ఎంపిక చేసిన 250 మందికి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, రాఘవేందర్, గోపాల్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానంద్, సుందర్, క్రాంతిగంగారెడ్డి, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు టెన్నికాయిట్ జట్ల ఎంపిక

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 25 : ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 27వ తేదీన జిల్లా సబ్ జూనియర్ టెన్నీకాయిట్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా టెన్నికయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిగౌడ్, ప్రధానకార్యదర్శి మల్లేష్‌గౌడ్‌లు తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 1-4-2010 తర్వాత జన్మించిన వారై ఉండాల న్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు ఆర్గనైజింగ్ కార్యదర్శి భూ పతికి రిపోర్టు చేయాలని సూచించారు. ఇతర వివరాలకు 950 2113860 నెంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

వేల్పూర్‌లో గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

వేల్పూర్, ఆగస్టు 25 : వేల్పూర్ మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆలయ మూడో వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం గంగమ్మతల్లికి గంగపుత్ర సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి ఆలయం వరకు గంగపుత్ర సంఘం మహిళలు బోనాలు తీయడం, నైవేద్యాలు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ పూజరి జుంబ రాతి రాజు ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి పంచామృతలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మగ్గిడి అశోక్, కార్యదర్శి తోపారం లక్ష్మణ్, గంగపుత్ర సంఘం సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

అర్మూర్‌టౌన్, ఆగస్టు 25 : పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగింపజేశారు. ప్రతీ ఆదివారం 2గంటల పాటు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలను, చెత్తచెదారాన్ని తొలగింపజేశారు. అలాగే మురికికాల్వలో ఉన్న చెత్తను తొలగించి శుభ్రపరిచారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీఒక్కరు తమ ఇంటి పరిసరాలను శుభ్రపర్చుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, కొక్కెర భూమన్న, కమలాకర్, ఎల్‌టి.కుమార్, గడ్డం శంకర్, ఎర్ర భూమయ్య, కొంతం రాజు, సతీష్, రవి, సాయన్న, ముత్తెన్న, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

- ఆర్టీసీ బస్సులు సకాలంలో రాక గంటల తరబడి ఎదురు చూపులు
- బస్టాండ్ నిర్మాణం పూర్తి కాక రోడ్డుపై నిరీక్షణ



ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 24 : ఆర్టీసీ బస్సులు ఎల్లారెడ్డి బస్టాండ్‌కు సకాలంలో రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఉదయం నుంచి చాలా మంది ప్రయాణికులు బస్టాండ్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు గంటల తరబడి రోడ్డుపై నిరీక్షించారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి కాక పోవడంతో పాటు ఆర్టీసీ బస్సు సర్వీసులు తగ్గించి నడుపుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. వివిధ గ్రామాలతో పాటు పట్టణాలకు చెందిన ప్రయాణికులు, విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సులు లేక బస్టాండ్‌లో గంటల తరబడి వేచి చూస్తు న్నారు. అయినప్పటికీ ఆర్టీసీ కంట్రోలర్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ సర్వీ సులను పెంచి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. అదే విధంగా బస్టాండ్ నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానికులు ప్రయాణీకులు కోరుతున్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న యువతులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 25 : ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్, సోమిర్యాఘడ్ తండాలలో గిరిజనులు తీజ్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. గోధుమలను తొమ్మి రోజులు బుట్టలో నానబెట్టి, బుట్ట వద్ద ప్రతిరోజు సాయంత్రం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి సంతోషంగా నృత్యాలు చేశారు. తొమ్మిదో రోజు పూర్తయ్యే నాటికి మొలకల్లో కొన్నింటిని గిరిజన పెద్దల తలపాగాల్లో వేసి మిగిలిన వాటిని సమీపంలోని చెరువులో వదిలారు. అనంతరం బుట్టలను తెచ్చిన యువతుల కాళ్ళను సోదరులు కడిగి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నాగం గోపికృష్ణ, మాజీ సర్పంచ్ లాఖావత్ రవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో వైద్య శిబిరం

కోటగిరి,ఆగస్టు25: పొతంగల్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ కోటగిరి ఆధ్వర్యంలో ఆదివారం ఆక్యుప్రెషర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ హెగ్డోలి శంకర్ ప్రారంభించారు. గ్రామంలో వారం రోజుల పాటు ఈ ఆక్యుప్రెషన్ వైబ్రేషన్ చికిత్స కొనసాగుతుందని ఆయన తెలిపారు. అధిక బరువు, మెడ నొప్పి, తలనొప్పి, రక్తపోటు, నిద్రలేమి, మధుమేహం, కీళ్ల నొప్పులు, కంటి, అసిడిటి, ఇతరత్రా సమస్యలకు చికిత్సలు అందిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంధపు పవన్, గంధపు రాజు, నాయకులు ఏజాజ్‌ఖాన్, వీరేశం, ధన్‌రాజ్, గంధపు దత్తు, శ్రీపాద్ పాల్గొన్నారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

మాక్లూర్, ఆగస్టు 25 : ఈనెల 31న, సెప్టెంబర్ 1, 2తేదీలలో హైదరాబాద్‌లో జరిగే ప్రగతి శీల మహిళా సంఘం ఏడో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నిజామాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి జైశెట్టి రాధ సూచించారు. ఆదివారం మండ లంలోని బోర్గం(కె) గ్రామంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ప్రతినిధుల సభలు ఉంటాయన్నారు. ఈ భవిష్యత్‌లో బల మైన ఉద్యమ కార్యాచరణకు రూపొందించుకుంటామని, ఇట్టి మహాసభలకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మ, సరోజన, కళావతి, గంగామణి, మధురి, తదితరులు పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి పరామర్శ

మెండోర, ఆగస్టు 25 : మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డిని రాష్ట్ర సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి అమ్మమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందడంతో మోహన్‌రెడ్డి, సునీల్‌కుమార్ పరామర్శించారు. వీరి వెంట టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, గంగారెడ్డి, సాయరెడ్డి, రాజారెడ్డి, మౌలానా, ప్రమోద్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

ముప్కాల్, ఆగస్టు25: బాల్కొండ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని రవళి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో జిల్లా స్థాయి యోగా అసోసియేషన్ అండర్-16 విభాగంలో ఉత్తమప్రతిభ కనబరిచిన రవళి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 31 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థి పాల్గొనున్నారు. విద్యార్థికి ప్రతిభ పోటీల్లో ఎంపికకు కృషి చేసిన పీడీ ముత్తెన్నను అభినందించారు.

బాధిత కుటుంబానికి సునీల్‌రెడ్డి పరామర్శ

ముప్కాల్, ఆగస్టు25: బాల్కొండ మండల కేంద్రంలో మాజీసర్పంచ్ తాళ్ళ శ్రీనివాస్ గుండెపోటుతో మరణించడంతో విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ ఆది వారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కు టుంబానికి అండగా ఉంటానమి హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

● ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

బాన్సువాడటౌన్ , ఆగష్టు 25 : ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం కార్యదర్శి దోసెపల్లి శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ యాజమాన్యం రిటైర్డ్ ఉద్యోగులకు 2017 పే స్కేలు ఏరియర్స్ జాప్యం చేయకుండా చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ప్రభుత్వం ద్వారా అందించే ప్రయోజనాలను అందజేయాలని, కేంద్రం ఈపీఎఫ్ 95 పెన్షనర్లకు 7500 పెన్షన్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కౌసర్ , నాగ్‌నాథ్, గంగారాం, లక్ష్మణ్, సభ్యులున్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి



బీపీ మండల్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్ , ఆగష్టు 25 : పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్ మాట్లాడుతూ బీపీ మండల్ కృషితోనే బీసీ లకు రాజ్యాంగంలో రిజర్వేషన్లు సాధ్యమయ్యాయని , బీసీలకు విద్య , ఉద్యోగం , రాజకీయాలలో కూడా రిజర్వేషన్లు కావాలని నిరంతరం కృషి చేసిన మహనీయుడన్నారు. బీసీ హక్కుల కోసం పదవులను సైతం త్యాగం చేశారని , బీసీ సామాజిక వర్గం ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కుమ్మరి సాయికుమార్ , రమేశ్ తదితరులున్నారు.

కాలం చెల్లిన వస్తువుల అమ్మకాలు!

ఎల్లారెడ్డి, ఆగస్టు 24 : ఫాస్ట్‌ఫుడ్, స్వీట్ హోమ్, కిరాణం దుకాణాల్లో కాలంచెల్లిన సరుకులు విక్రయిస్తూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఓ దుకాణ యజమాని కాలం చెల్లిన కూల్‌డ్రింక్ బాటిల్‌ను విక్రయించాడు. కూల్‌డ్రింక్ తాగుతుండగా దుర్వాసన రావడంతో తయారు చేసిన తేదీని పరిశీలించగా అది కాం చెల్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై దుకాణదారున్ని నిలదీయడంతో అతను నీళ్ళు నమిలాడు. సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని అధికారులు మామూళ్ళు తీసుకుని పర్యవేక్షణ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలం చెల్లిన వస్తువులు తిని ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని సంబంధిత శాఖ అధికారులు కాలం చెల్లిన వస్తువులు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పీఆర్టీయూ మండల అసోసియేట్ అధ్యక్షుడిగా సుధాకర్

ఏర్గట్ల, ఆగష్టు 25: పీఆర్టీయూ మండల అసోసియేట్ అధ్యక్షుడిగా మైసాల సుధాకర్‌ను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్‌లు నియమించినట్లు ఏర్గట్ల పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా మండల పీఆర్టీయూ సభ్యులు సుధాకర్‌కు వారు అభినందనలు తెలిపారు.

'బాధిత కుటుంబానికి అండగా ఉంటాం'



భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఆగస్టు 25 : ఇటీవల మృతిచెందిన భిక్కనూరు టోల్ ప్లాజా సిబ్బంది, మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ఏనుగు సంతోష్‌రెడ్డికి టోల్‌ప్లాజా సిబ్బంది ఆదివారం సంతాపసభ కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టోల్‌ప్లాజా అధ్యక్షుడు నర్సాగౌడ్ మాట్లాడుతూ తమతో కలవిడిగా ఉండే సంతోష్‌రెడ్డి మరణించడం తాము తట్టుకోలేకపోతున్నామన్నారు. ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, ఆగస్టు 25 : నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామశివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

నేడు ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే పర్యటన

ఎల్లారెడ్డి, ఆగస్టు 25 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సోమార్‌పేట్ బైపాస్ వద్ద నూతనంగా నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళను సోమవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పరిశీలిస్తారని క్యాంపు కార్యాలయం సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పేర్కొన్నారు.

'బీజేపీ సభ్యత్వ నమోదు గ్రామగ్రామాన చేపట్టాలి'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి

మాచారెడ్డి, ఆగస్టు 25 : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామగ్రామాన చేపట్టాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాచారెడ్డి మండల కేంద్రంలో సభ్యత్వ నమోదుపై కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాలలో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేపట్టాలని కేంద్రప్రభుత్వం తీసుకువస్తున్న అనేక సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేష్, జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నర్సింలు, శేఖర్, ఉపాధ్యక్షులు క్రాంతి, మహిళా మోర్చా అధ్యక్షురాలు రజిత, ప్రభాకర్, రవి, కిషన్, స్వామిగౌడ్, శ్రీనివాస్, రఘు, గుగులోత్‌నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 25 : కామారెడ్డి పట్టణంలోని అమృత గ్రాండ్‌లో హనుమాన్‌మందిర్ ప్రభుత్వ పాఠశాలలో 1990-91 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి చదువులు చెప్పిన గురువులను సన్మానించారు. పాఠశాల మొదటిబ్యాచ్ కావడంతో ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.

యువకుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డి, ఆగస్టు 25 : యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎల్లారెడ్డి మండలంలోని బిక్కనూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బుడ్డేపల్లి రవి (35) అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని శ్మశాన వాటికలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొన్ని సంవత్సరాల క్రితం సంగారెడ్డి జిల్లా కాల్హేర్ మండలంలోని మిర్జాఖాన్ పేటకు చెందిన రవి అనే యువకుడు ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూరు గ్రామానికి చెందిన లక్ష్మీ ఇంటికి ఇల్లరికం వచ్చాడు. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు, కుమార్తె ఉన్నారని గ్రామ స్తులు తెలిపారు. ఈ విషయంపై ఎల్లారెడ్డి ఎస్‌ఐ బొజ్జ మహేష్ వివరణ కోరగా వారి నుంచి ఇంకా ఎలాంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

లింగంపేట ఎస్సైగా అరుణ్‌కుమార్

లింగంపేట, అగస్ట్ 25 : లింగంపేట ఎస్సైగా అరుణ్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. లింగంపేట ఎస్సైగా పనిచేసిన ఎస్సై చైతన్యకుమార్ చేగుంటకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కామారెడ్డిలో వీఆర్‌లో ఉన్న ఎస్సై అరుణ్‌కుమార్ లింగంపేట ఎస్సైగా వచ్చారు. ఈ మేరకు నియమిస్తూ ఎస్పీ సింధూశర్మ ఉత్తర్వులు జారీ చేశారు.



బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

కేజీబీవీలో సమస్యలతో చదువులు

● మద్నూర్ పాఠశాలలో కనీస వసతులు కరువు

మద్నూర్, ఆగస్టు 25 : బాలికలకు ఉజ్వల భవిష్యత్తు ఇచ్చేందుకు కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన కేజీబీవీలో నాణ్యమైన భోజనంతో పాటు విద్యా నైపుణ్య శిక్షణ అందించడంతో ప్రవేశాలకు మంచి ఆదరణ పెరుగుతోంది. బోధన కూడా బాగుండడంతో తమ పిల్లలను చేర్పించేందుకు పైరవీలు చేయించి మరీ విద్యాలయాల్లో తల్లిదండ్రులు చేర్పిస్తున్నారు. దీంతో ప్రతియేటా విద్యార్థినుల సంఖ్య పెరుగుతుంది. విద్యార్థినులకు అనుగుణంగా వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛమైన తాగునీటికోసం ఇప్పటి వరకు వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయలేకపోవడం, ఉదయాన్నే స్నానం కోసం గీజర్స్, వాటర్ హీటర్స్ ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా కరెంట్ పోయిన సమయాల్లో విద్యార్థినులు ఇబ్బందులు పడకుండా ఇన్వేటర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. కాని ఇప్పటి వరకు ఇన్వేటర్‌లు ఏర్పాటు చేయకపోవడంతో చీకట్లో ఎలా చదువుకోవాలంటూ విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో ఐదుసంవత్సరాల క్రితం కేజీబీవీ పాఠశాల నిర్మాణం చేశారు. కాని రెండు సంవత్సరాల క్రితమే నూతనంగా నిర్మించిన భవనంలోకి రావడం జరిగింది. విద్యార్థినులు రెండుసంవత్సరాల నుంచి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా వాటిని పట్టించుకున్న పాపన పోలేదు. ఇన్ని సమస్యలున్న కేజీబీవీ నిర్వాహకులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్నూర్ కేజీబీవీ పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థినులున్నారు. వారికి చదువు బోధించడానికి మరో ఇద్దరి ఉపాధ్యాయులు అవసరం ఉన్నా ఇంత వరకు నియమించలేదు. కేజీబీవీలో ఆరు నుంచి పదో తరగతి వరకు కొనసాగుతున్న కేజీబీవీల నిర్వహణ కోసం ప్రతియేటా కేంద్ర ప్రభుత్వం నుంచి 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 40 శాతం నిధులు వస్తాయి. అయినప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారి కస్తూర్బా గురుకుల పాఠశాలను విజిట్ చేశారు. కాని సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బాలికలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



మద్నూర్ కేజీబీవీ పాఠశాల

● జిల్లా అధికారులకు విన్నవించాం

ఈ ఏడాది జూన్ మాసం పాఠశాలల ప్రారంభ సమయంలో కస్తూర్బా పాఠశాలలో ఉన్న సమస్యల గురించి జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశామని కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ సత్యశీల తెలిపారు.

- సత్యశీల, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకుందాం

● మున్నూరు కాపు సంఘం నాయకుల మౌనదీక్ష



మద్నూర్‌లో మౌనదీక్ష చేపట్టిన మున్నూరు కాపులు



భిక్కనూరులో...

మద్నూర్, ఆగస్టు 25 : మున్నూరు కాపులు ఐక్యంగా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు గం గారాం అన్నారు. మద్నూర్, డోంగ్లి మండల కేంద్రాలలో ఆదివారం తమ సమస్యల సాధన కోసం మున్నూరు కాపులు మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు హక్కుల సాధనకై మన డిమాండ్స్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సాధించుకోవడానికి జిల్లా అధ్యక్షులు మామిండ్ల అంజయ్య పటేల్ ఆదేశం మేరకు మౌన పోరాట దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సందూర్ హన్మాండ్లు, తైదల్ చందర్, తూమ్ రాములు, రామకిషన్, బంకలి హన్మాండ్లు, శివరాం, అనుము హన్మాండ్లు పాల్గొన్నారు.

భిక్కనూరు : రాష్ట్రంలో మున్నూరుకాపులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని భిక్కనూరు మండల మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండలకేంద్రంలో మౌనదీక్ష కార్యక్రమాన్ని సంఘ సభ్యులు నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ జిల్లాకేంద్రం లో మున్నూరుకాపు భవన నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దోమకొండ:మున్నూరు కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలో సంఘం ప్రతినిధులు మౌనదీక్ష చేశారు. మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కూర చంద్రం ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు సాయిలు, మైసయ్య, వెంకటేష్, మహేష్, రాజు, లక్ష్మణ్, వంశీ, ప్రశాంత్, తదితరులు మౌనదీక్షలో పాల్గొన్నారు. ప్రభుత్వం మున్నూరుకాపు సంఘానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మౌనదీక్ష చేసినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

అనుమతి లేని మందులు వాడితే కఠిన చర్యలు

● ఇన్‌చార్జీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

సదాశివనగర్, ఆగస్టు 25: అనుమతులు లేకుండా హైడోస్ మందులు వాడితే కఠినచర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సదాశివనగర్ మండలంలోని భూంపల్లి, పద్మాజీవాడి ఎక్స్‌రోడ్ గ్రామాలలో గల పీఎంపీలు, ఆర్‌ఎంపీల నిర్వహిస్తున్న క్లీనిక్‌లను, మెడికల్ షాపులను మండల వైద్యాధికారి ఆస్మాఅఫ్రీన్‌తో కలిసి పరిశీలించారు. పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డులో అనుమతులు లేకుండా హైడోస్ మందులు వాడుతున్న పీఎంపీ రాజిరెడ్డికి చెందిన ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్‌చేసినట్లు తెలిపారు. భూంపల్లి గ్రామంలో మృతిచెందిన ఇద్దరు చిన్నారులు జ్వరంతో పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డులో గల ప్రథమ చికిత్సాలయంలో వైద్యం చేయించుకున్నారని తెలిపారు. జ్వరంతో వచ్చిన వారికి హైడోస్ మందులు వాడినట్లు గుర్తించామన్నారు. భిక్కనూర్, లింగంపేటలోను ప్రథమ చికిత్స కేంద్రాలను సీజ్‌చేశామని తెలిపారు. ప్రథమ చికిత్స కేంద్రానికి జ్వరంతో, జలుబుతో వచ్చేవారికి మాత్రమే మందులు అందించాలని గ్లూకోజ్‌లు పెట్టవద్దని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు జ్యోతి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.



పద్మాజీవాడి ఎక్స్‌రోడ్ క్లీనిక్‌లో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో

కాచాపూర్ విండో ఏర్పాటుపై హర్షం

భిక్కనూరు, ఆగష్టు 25: కాచాపూర్ విండోను తిరిగి ప్రత్యేక విండోగా ఏర్పాటు చేయడం పట్ల కాచాపూర్ విండో ఎదుట ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ డైరెక్టర్ కిష్టాగౌడ్, మాజీ ఎంపీపీ గాల్‌రెడ్డి, తొగరి సుదర్శన్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మా ప్రభుత్వం హయాంలోనే

కాచాపూర్ ప్రత్యేక విండో ఏర్పాటు..

భిక్కనూరు : మండలంలోని కాచాపూర్ విండోను బస్వాపూర్ విండో నుంచి ప్రత్యేక విండోగా తమ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేస్తూ జీవో జారీ అయిందని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం హయాంలోనే కాచాపూర్ ప్రత్యేక విండోగా ఏర్పాటు కాగా ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యం జరిగిందన్నారు. కాచాపూర్ రైతుల ఆకాంక్ష మేరకు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటీ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని కాచాపూర్‌ను బస్వాపూర్ విండో నుంచి సపరేట్ చేసి తిరిగి ప్రత్యేక విండోగా ఏర్పాటు చేసేందుకు కృషి చేశారన్నారు. కానీ కాంగ్రెస్ నాయకులు ప్రస్తుత ప్రభుత్వంలోనే ఇది జరిగిందని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆటోడ్రైవర్లకు రూ.12 వేలు ఇవ్వాలి

● సీఐటీయూ జిల్లా నాయకుల డిమాండ్

బాన్సువాడ, ఆగస్టు 25 : ప్రతినెల ఆటోడ్రైవర్ల కుటుంబానికి రూ.12 వేల జీవనవృద్ధి ప్రభుత్వం చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ డిమాండ్ చేశారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలోని రెడ్డి సంఘంలో ఏర్పాటు చేసిన లోకల్ ఆటో యూనియన్ నూతన కార్య వర్గ సమావేశంతో పాటు ఆటో డ్రైవర్ల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా ఖలీల్ మాట్లాడుతూ ఆటోలు నడుపుతున్న ఆటో డ్రైవర్లు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, ఆటోలు నడవక, ఆటో ఇన్‌స్టాల్‌మెంట్ కట్టలేక, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటడంతో ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉచిత బస్సు ప్రయాణమని తేవడం జరిగిందని, దీంతో అనేక కిరాయిలు తగ్గిపోవడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆటోలు నడుపుతున్న ప్రతి ఒక్క ఆటో డ్రైవర్‌కి సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తారని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కాని ప్రతినెలకు రూ.12 వేల రూపాయల జీవనభృతి ఇవ్వాలని ముఖ్యమంత్రికి కోరుతున్నామన్నారు. అతి త్వరలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆటోలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా నాయకులు జె.రవీందర్, నూతన అధ్యక్షుడు చాంద్, కార్యదర్శి ఆసిఫ్‌ఖాన్, ఉపాధ్య క్షుడు లక్ష్మణ్, క్యాషియర్ విజయ్, సాయిలు, ముహరాజ్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

'పాతపెన్షన్ విధానమే కావాలి'

కామారెడ్డిటౌన్, ఆగస్టు 25 : కేంద్రప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో కొత్త పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, తమకు పాతపెన్షన్ స్కీమే కావాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి అనిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న యూనిఫైడ్ పెన్షన్ 2025 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని 25 సంవత్సరాలు సర్వీసు చేసి ఉద్యోగి చివరి 12 నెలల జీతంలో 50శాతం పెన్షన్‌గా చెల్లిస్తారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం పెరిగినప్పుడు పెన్షనర్లకు కూడా పెరుగుతుందని గతంలో లానే గ్రాట్యూటీ కూడా ఉంటుందని, ఆరునెలల సర్వీస్‌కు ఒక నెల జీతం, కరువుభత్యంలో 10 శాతం అదనపు గ్రాట్యూటీగా చెల్లిస్తారని అన్నారు. అయితే సీపీఎస్ పథకంలో వలనే ఉద్యోగి జీతంలో నుంచి 10 శాతం మినహాయింపు ఉంటుందని, ఇది సీపీఎస్ మరో రూపమే తప్ప పాత పెన్షన్ విధానం కాదని అన్నారు.

అయ్యప్ప సేవా సమితి కార్యవర్గం ప్రమాణస్వీకారం

కామారెడ్డిటౌన్, ఆగస్టు 25 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్‌హాల్‌లో అయ్యప్పసేవాసమితి, అన్నప్రసాద సేవాసమితి నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షులుగా గందె శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పట్నం రమేష్, కార్యదర్శిగా గోనె శ్రీనివాస్, కోశాధికారిగా సోమిశెట్టి నారాయణ, అన్నప్రసాద సేవ సమితి అధ్యక్షుడిగా విశ్వనాథుల రాజేందర్, కార్యదర్శిగా బాసరఘుకుమార్, కోశాధికారిగా మోట్కూరి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కూర శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటీవ్ కార్యదర్శిగా చిదుర ఓంకారంలు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో యాదనాగేశ్వర్‌రావు, మోటూరి శ్రీకాంత్, తాళ్లపల్లి దేవరాజ్‌గౌడ్, చాట్ల రాజేశ్వర్,కుంబాలరవి తదితరులున్నారు.

ఉచితంగా బీమా బాండ్ల పంపిణీ



ఉచితంగా బాండ్లను అందజేస్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి

మద్నూర్, ఆగస్టు 25 : మద్నూర్‌లో గ్రామ పంచాయతీ సిబ్బంది, సఫాయి కార్మికులకు బీమాసౌకర్యాన్ని ఉచితంగా కల్పించి వారికి బాండ్లను జిల్లా బీజేపీ కార్యదర్శి కృష్ణపటేల్ అందజేశారు. ఆదివారం మద్నూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో తన సొంత ఖర్చులతో 26 మంది గ్రామ పంచాయతీ సిబ్బంది సఫాయి కార్మికులకు ఉచితంగా బీమా సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కరోనా మహమ్మారి తర్వాత ప్రజలు తమ ప్రమాద బీమా కోసం కొత్త పథకాల కోసం చూస్తున్నారని, ఇప్పుడు కుటుంబంలో ప్రతి సభ్యునికి ప్రమాదబీమా ఉండడం చాలా ముఖ్యమని, ఇండియా పోస్టు ఆఫీసర్ ఇందుకోసం రూ.500 చెల్లిస్తే ఏడాది పాటు ఇన్సూరెన్స్ ఉంటుందని, ప్రమాదం జరిగితే పదిలక్షల వరకు ప్రభుత్వమే ఖర్చులు భరిస్తుందన్నారు. పేదలైన గ్రామ పంచాయతీ సఫాయి కార్మికుల కోసం తన వంతుగా 26 మందికి ఇన్సూరెన్స్ చేయించినట్లు వెల్లడించారు. ఈ పాలసీలో ఖర్చుల కోసం 60 వేలు, ప్రమాదవశాత్తు గాయమైతే 30 వేలు ఇస్తారు. మరో వైపు ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబాలకు 10 లక్షల పరిహారం అందజేస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ పథకం కింద ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీపీ మండల్ జయంతి

ఎల్లారెడ్డి, ఆగస్టు 25 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో బీసీ మండల్ జయంతి నిర్వహించారు. ఎల్లారెడ్డి బీఎస్పీ పట్టణ అధ్యక్షులు మర్లు సాయి బాబా, బీసీ విద్యార్థి విభాగం ఎల్లారెడ్డి నియోజకవర్గం అధ్యక్షులు లింగ మయ్య ఆధ్వర్యంలో బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	డబుల్ ఇస్మార్ట్
దర్శన్	మిస్టర్ బచ్చన్
ప్రియా 70	తంగలన్
ప్రియా 35	ఆయ్

బాన్సువాడ	
మహేశ్వరి	మిస్టర్ బచ్చన్
వెంకటేశ్వర	తంగలాన్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190

